క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన బొజ్జమ్మ



కలెక్టర్‌ను కలసి బొకే అందజేస్తున్న బొజ్జమ్మ, రామచంద్రనాయుడు

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త రామచంద్రనాయుడు మంగళవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువకు ఎక్కువ రోజులు నీళ్లిచ్చి రైతుల పంటలను కాపాడాలని కోరారు.

3న కురువల కార్తీక వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 3న కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయ ప్రాంగణంలో వన భోజనాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపాడు రోడ్‌లోని మోడల్ స్కూల్ పక్కన ఉన్న బీర లింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని కురువ సామాజిక ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, ఉపాధ్యక్షులు బిల్డర్ వెంకటేశ్వర్లు, ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, బీసీ తిరుపాల్, దేవేంద్ర, తవుడు శ్రీనివాసులు, బి.రామక్రిష్ణ, రాజు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సీఐటీయూ సిద్ధమన్నారు. అందులో భాగంగానే విజయవాడలో మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధర్నాకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నాయకులు బి.రామాంజనేయులు, పి.ఈరన్న, సీహెచ్ సాయిబాబా, ఎం.విజయ్, ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

భద్రతకు అధిక ప్రాధాన్యత

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. నందవరం మండల విద్యుత్ ఏఈని సస్పెండ్ చేసిన నేపథ్యంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా ఎర్త్ రాడ్‌ల కొరత లేదన్నారు. లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, కింది స్థాయి సిబ్బంది పనికి ముందు తప్పనిసరిగా ఎర్త్ రాడ్ వేసుకోవాలని సూచించారు. అదే విద్యుత్ ప్రమాదం నుంచి కాపాడుతుందని చెప్పారు. ప్రతి అధికారి సంస్థకు చెందిన వారితోనే పనులు చేయించాలని, ప్రైవేటు వ్యక్తులతో చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కర్నూలు(సెంట్రల్): చెన్నై–సూరత్ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న దుద్యాల గ్రామ రైతులకు ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో 50 మంది బాధిత రైతులు డీఆర్వో కె.మధుసూదన్‌రావును కలిసి తమ గోడును విన్నవించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రూ.2కోట్ల విలువ చేసే రైతుల భూములకు రూ.7.5 లక్షల పరిహారం ఇస్తామనడం అన్యాయమన్నారు. రైతుల ప్రమేయం, అనుమతి లేకుండా వారి ఖాతాల్లో పరిహారాన్ని జమ చేయడం తగదన్నారు. వెంటనే రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కోరారు.

నగర అభివృద్ధే లక్ష్యం


- కర్నూలు మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: కర్నూలు నగర అభివృద్ధే లక్ష్యమని నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ పరిధి పాత కల్లూరులోని వక్కెర వాగు బ్రిడ్జిపై రూ.10 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లూరు అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోందన్నారు. ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పాలక వర్గం ఏర్పడిన తర్వాత కర్నూలు నగరంతో పాటు, కల్లూరు అర్బన్ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జిపై రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, లక్ష్మీరెడ్డి, శ్వేతారెడ్డి, నాయకులు రంగప్ప, శివశంకర్ రెడ్డి, శ్రీనివాసులు, సంపత్తి సుబ్బారెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని మరింత పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆయన పలు విభాగాల హెచ్‌ఓడీలతో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, చిన్నపిల్లల విభాగాలు ఆరోగ్యశ్రీలో మంచి ప్రతిభ చూపారని అభినందించారు. ఓపీ విభాగాలను ఈ–హాస్పిటల్ పోర్టల్‌లో అప్‌లోడింగ్‌ను 60 శాతం వరకు చేశారన్నారు. 100 శాతానికి చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. క్యాజువాలిటీ విభాగాల్లో డ్యూటీ డాక్టర్లు.. ఉన్నతాధికారుల ఫోన్లకు స్పందించాలన్నారు. ఆసుపత్రిలో అసిస్టెంట్ల ప్రొఫెసర్లకు 20 శాతం కంటే ఎక్కువ సెలవులు మంజూరు చేయకూడదని హెచ్‌ఓడీలకు సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, హెచ్‌ఓడీలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీలక్ష్మీబాయి, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం పురాతనమైనది



మాట్లాడుతున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆయుర్వేద వైద్యం పురాతనమైనదని, వేదకాలం నుంచే జీవనవిధానంలో కొనసాగుతోందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు ద్వారం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆయుష్ డిస్పెన్సరీలో మంగళవారం బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థినులకు ఆయన ఆయుష్ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ విభాగంలోని యోగా, హోమియోపతి, నేచురోపతి, యోగా, యునాని తదితర విభాగులు, వైద్య విధానం గురించి వివరించారు.

కొనసాగుతున్న బాబా జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. యూత్ డే నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. గాయత్రీ గోశాలలో గోవులకు గ్రాసం అందించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న అభాగ్యులకు ఆహారం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాశా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.



సత్యసాయి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బెయిల్ కోసమే అనారోగ్య డ్రామాలు



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ నేత చంద్రబాబు కేసుల నుంచి బెయిల్ పొందేందుకే అనారోగ్య డ్రామాలు ఆడారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు సానుభూతి పొందేందుకు ఎత్తులు వేస్తున్నారని, అయినా జనం నమ్మరని చెప్పారు. ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలకు చంద్రబాబు గురించి ఆలోచించే అవసరం లేదన్నారు. అవినీతికి పాల్పడ్డారు కాబట్టే న్యాయస్థానం బాబును జైలుకు పంపిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, రాముడు, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల శిక్షణా తరగతులు పునరుద్ధరించాలి



ప్రజాప్రతినిధులను కలిసిన సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని దాదాపు 50 వేల మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణా తరగతులు పునరుద్ధరించాలని గ్రామీణ వైద్య సంఘాల నాయకులు మంగళవారం ప్రజాప్రతినిధులను కోరారు. రాష్ట్ర సచివాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ప్రత్యేక అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డిలతో పాటు ప్రజాప్రతినిధులను వేర్వేరుగా కలిసి సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.దస్తగిరి, రాష్ట్ర నాయకులు ఇల్లూరు నరసింహ, నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలసి ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నాకు దిగాడు. సర్వే నంబర్ 222 లోని 5 ఎకరాల భూమి గతంలో చుక్కల భూమిగా ఉండేదని, చుక్కల భూమి జాబితా నుంచి తొలగించి అసైన్డ్ భూముల జాబితాలో అధికారులు చేర్చారని తెలిపారు. దీంతో తన భూమిని విక్రయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్‌లో కర్నూలుకు పతకం



డి.సాయిశంకర్

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్‌లో కర్నూలుకు చెందిన డి.సాయిశంకర్ ద్వితీయ స్థానంలో నిలిచి పతకం సాధించాడు. మంగళవారం కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 19 నుంచి 21 వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్–17 విభాగంలో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి డి.సాయిశంకర్ ప్రతిభ చాటి వెండి పతకం సాధించి జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు.

దళారులను నమ్మి మోసపోవద్దు




ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

కోడుమూరు: ప్రభుత్వ పథకాల మంజూరు కోసం లబ్ధిదారులు దళారులకు పైసా ఇవ్వాల్సిన పని లేదని, దళారులను నమ్మి మోసపోవద్దని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఈఈ ప్రభాకర్ పర్యటించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీని సందర్శించి నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పీడీ చెప్పారు. బిల్లుల మంజూరు కోసం ఎవరికి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ఆహ్లాద ‘వన’ విహారం

- ఆదోని పట్టణ శివారులో మరో నగర వనం
- కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 39.40 హెక్టార్లలో ఏర్పాటు
- నగర వన యోజన పథకం కింద రూ.2 కోట్ల నిధులు
- నగర వాసులు సేదతీరేలా సుందరీకరణకు చర్యలు





ఆదోని నగర వనం ఏర్పాటు కానున్న కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నగర, పట్టణ వాసులు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో త్వరితగతిన నగర వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కర్నూలు మండల పరిధిలో కర్నూలు నగర వనం, డోన్ మున్సిపాలిటీ పరిధిలోని నగర వనాల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కర్నూలు నగర శివారు కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిలో విజయ వనం పుల్లయ్య పార్క్‌లో సుందరీకణ పనులు పూర్తి చేసి అభివృద్ధి చేశారు. దీన్ని త్వరలో నగర వాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితో పాటు నగర వన యోజన పథకం కింద ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 39.40 హెక్టార్లలో రూ.2 కోట్ల నిధులతో మరో నగర వనాన్ని అభివృద్ధి చేయనున్నారు.

నగర వనంలో చేపట్టనున్న పనులు

నగర వనం ప్రధాన ద్వారం ఆర్చ్, పార్క్, వాకింగ్ ట్రాక్, బైస్కిల్ ట్రాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈఈసీ), చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్, ల్యాండ్ స్కేపింగ్, చైన్ లింక్ ఫెన్సింగ్, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.

నగర వనాల అభివృద్ధికి చర్యలు



నగర, పట్టణ వాసులు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నాం. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలో నగర వన యోజన పథకంలో కేంద్ర నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో మరో నగర వనం ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రూ.1.40 కోట్ల నిధులు కేటాయించారు. ఈ వారంలోగా నిధులు మంజూరు కానున్నాయి. వెంటనే పనులు ప్రారంభమవుతాయి. త్వరలోనే నగర వనం అందుబాటులోకి తీసుకొస్తాం. – పి.శివశంకర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి, కర్నూలు

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి గడపకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక 48వ వార్డు రోజా వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్, రెవెన్యూ, వైద్య సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హుల చెంతకే ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వలంటీర్లు ప్రభుత్వ సేవలను ఎలాంటి సిఫారసు లేకుండా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, పార్టీ నాయకులు జలీల్, దాదా బాషా, మద్దయ్య, సఫియా ఖాతున్, జిలానీ, నసీర్, ఖలీలుల్లా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టేటు ఆఫీసర్‌కు ఇచ్చుకోలేకపోతున్నాం

- జేసీకి మొరపెట్టుకున్న కొత్తపేట రైతుబజార్ వ్యాపారులు

కర్నూలు(అగ్రికల్చర్): కొత్తపేట రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్‌కు తాము అడిగినంత మామూళ్లు ఇచ్చుకోలేకపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు అమ్ముకోకపోయినా ఎస్టేట్ అధికారి బాడుగ సాకుతో మామూళ్లు అడుగుతున్నారని మంగళవారం పలువురు రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన మొత్తం కంటే రెట్టింపు డిమాండ్ చేస్తున్నారని, అంతటితో సరిపెట్టుకోక నెల మామూళ్లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కాగా గతంలోనూ అడ్డగోలు అక్రమాలకు పాల్పడుతుండటంతో నంద్యాలకు బదిలీ చేశారు. పైరవీ చేసుకుని మళ్లీ కొత్తపేట రైతుబజారుకే వచ్చి అక్రమాలు సాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఫిర్యాదులు వచ్చినమాట వాస్తవమేనని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరింత పారదర్శకంగా ఓటరు జాబితా

కర్నూలు (టౌన్): ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా చేపడుతున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జాబితాలో తప్పులు, మార్పు, చేర్పులు, పోలింగ్ బూత్ మార్పులు, మరణాలను పరిగణలోకి తీసుకొని జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే వినతులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జంక్ ఫుడ్‌తో ఫ్లోరోసిస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): నిల్వ చేసిన జంక్‌ఫుడ్ తినడం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. మంగళవారం ఆయన వామసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన కల్పించారు. హై ఫ్లోరైడ్ టూత్ పేస్ట్, నిల్వ ఉండే చిరుతిళ్లు, శీతల పానియాలు, రెడీమేడ్ చిప్స్, ప్యాకేజ్ ఆహార పదార్థాలలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటుందన్నారు. మనం తీసుకున్న ఆహారం, నీరు కారణంగా శరీరంలో ఫ్లోరోసిస్ ప్రవేశిస్తుందన్నారు. మొదట పళ్ల ద్వారా బయటపడే ఈ వ్యాధి ఎముకలకు వ్యాపిస్తుందన్నారు. ఎముకలపై చూపే ప్రభావం ఫలితంగా శరీర భాగాలు, కాళ్లు చేతులు వంకరపోతాయన్నారు. కొందరి పళ్లు అరిగిపోవడం, గారాలు పట్టడం జరుగుతుందన్నారు. ఆకలి మందగించడం, కడుపు ఉబ్బరంగా ఉండటం, అధికంగా దాహం వేయడం వంటి లక్షణాలు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.మాలతిదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యసేవలు



వైద్యులతో డీఎంఅండ్ హెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య తెలిపారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కె.మార్కాపురం హెల్త్‌వెల్‌నెస్ సెంటర్, ఎన్‌టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ, ఇందిరమ్మ గృహాలను సందర్శించి అక్కడి ఫ్యామిలి ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు, రిపోర్టులు తనిఖీ చేశారు. రోగులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు.

26న కార్తీక లక్ష దీపోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: ఈనెల 26న స్థానిక వినాయక్ ఘాట్ కేసీ కెనాల్‌లో కార్తీక లక్ష దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవ సమితి కార్యాధ్యక్షులు ఇ.పద్మావతి తెలిపారు. మంగళవారం సమితి కార్యాలయంలో దీపోత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26న సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 5 గంటలకు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి వినాయక్ ఘాట్ వరకు శివపార్వతుల రథోత్సవం, 6 గంటలకు ఆకాశ దీప ప్రజ్వలనం, 6.30 గంటలకు శివపార్వతుల అభిషేకం, కల్యాణం, 7.30 గంటలకు నాగఫణి శాస్త్రి బృందం చేత గంగా హారతి, జ్వాలా తోరణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కర్నూలు కల్కి సేవా సమితి ఉచిత దీపదానం, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్, మేయర్ బీవై రామయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ కుటుంబ సభ్యులు హాజరు కానున్నారన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు విశాలక్ష్మమ్మ, కార్యదర్శి స్వప్నసారథి, సమన్వయ కార్యదర్శి వై.వి.ఉమ, సహ కార్యదర్శులు రజని కల్యాకర, జయలక్ష్మి, కోశాధికారి అనిత, సభ్యులు కృష్ణ వేణి, హేమలత, మల్లికార్జున రెడ్డి, తుంగా రమేష్, మురళి, నాగోజిరావు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకోండి

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనను పీడీఎస్‌యూ కోరింది. మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు.